RNI NO.TELTEL/2022/83842

PRABHATA GAMANAM

# ప్రభాత గమనం

తెలుగు దినపత్రిక

వరంగల్ | సంచిక 297 | సంపుటి 4 | గురువారం | 30-07-2026 | పేజీలు 4 | వెల 3/-

ప్రభాత గమనం తెలుగు దినపత్రిక

జర్నలిస్టుగా....ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకొచ్చి వాటి పరిష్కారానికి కృషి చేయాలనుకుంటున్నారా ?

విలువలతో కూడిన జర్నలిస్టుగా... ఆత్మగౌరవంతో పాత్రికేయుడుగా సాగాలనుకుంటున్నారా...

ప్రభాత గమనం తెలుగు దినపత్రిక మీకు ఆహ్వానం పలుకుతుంది. ఆసక్తి కలిగిన అనుభవజ్ఞులైన విలేకరులు వెంటనే సంప్రదించండి.

ఫోన్ : 7780470374



## సీఎంఆర్‌కు గడువు

# ఆరు రోజులే

- మానుకోట జిల్లా వ్యాప్తంగా పేరుకు పోయిన 90 కోట్ల బియ్యం బకాయిలు...
- ఇంకా రికవరీ కావాల్సింది ఎంత...? ఎంత రికవరీ అయింది...
- మిల్లుల్లో అసలు ధాన్యం ఉందా...?
- ధాన్యం దారి మళ్లించిన మిల్లర్లపై అధికారులకు ప్రేమ ఎందుకు.....???
- వారిని ఎందుకు కాపాడుతున్నారు...??
- చర్యలు తీసుకోకపోవడం వెనుక మతలబ్ ఏంటీ....
- ముఖ్యమంత్రి సారు...మా జిల్లాపై దృష్టి పెట్టండి సారు...
- అధికారుల ఉక్కుపాదం తప్పదా... టాస్క్‌ఫోర్స్ రంగంలోకి దిగుతుందా?

**మహబూబాబాద్ జులై 29 (ప్రభాత గమనం):**

ప్రభుత్వం ఇచ్చిన గడువు ముగియడానికి కేవలం ఆరు రోజులు మాత్రమే సమయం మిగిలి ఉంది. కానీ, జిల్లా వ్యాప్తంగా మిల్లుల నుంచి రావాల్సిన కస్టమ్ మిల్లింగ్ రైస్ బకాయిలు మాత్రం కొండలా పేరుకుపోయాయి. రైస్ మిల్లర్ల వద్ద నుంచి ఏకంగా రూ. 90 కోట్ల విలువైన బియ్యం బకాయి పడటంతో పౌరసరఫరాల శాఖ తీవ్ర ఆందోళనలో పడింది. ఇప్పటివరకు అధికారులు జరిపిన రికవరీ ఎంత? ఇంకా రాబట్టాల్సింది ఎంత? అసలు ఈ మిల్లుల్లో అంత సరుకు ఉందా... లేక పక్కదారి పట్టిందా? అనే అనుమానాలు జిల్లా వ్యాప్తంగా వ్యక్తమవుతున్నాయి.గత యాసంగి, వానాకాలం సీజన్లకు సంబంధించిన బియ్యాన్ని ప్రభుత్వానికి అప్పగించడంలో పలువురు మిల్లర్లు నిర్లక్ష్యం వహించారు. నిబంధనల ప్రకారం రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని ఆడించి, నిర్ణీత గడువులోగా ఎఫ్‌సీఐ కి గానీ, సివిల్ సప్లైస్ కార్పొరేషన్‌కు గానీ బియ్యం రూపంలో అప్పగించాలి. కానీ, జిల్లాలో ఆ ప్రక్రియ అత్యంత నెమ్మదిగా సాగుతోంది. ప్రభుత్వం విధించిన తుది గడువు మరో ఆరు రోజుల్లో ముగియనుండటంతో పౌరసరఫరాల శాఖ అధికారుల్లో పరుగు పందెం మొదలైంది. ఇప్పటివరకు జరిపిన రికవరీ నామమాత్రంగానే ఉండటం, ఇంకా కోట్లాది రూపాయల బకాయిలు నిలిచిపోవడం అధికారులకు నిద్రలేకుండా చేస్తోంది.ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన ప్రధాన అంశం.

### మిల్లుల్లో అసలు ధాన్యం ఉందా లేదా?"

కొందరు మిల్లర్లు ప్రభుత్వ ధాన్యాన్ని అడ్వాన్స్‌గా అమ్ముకోవడం, లేదా దాన్ని రీ–సైక్లింగ్ చేసి మళ్లీ ప్రభుత్వానికే అంటగట్టేందుకు కుట్రలు పన్నుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.కాగితాల్లో చూపించిన ధాన్యం నిల్వలు, మిల్లుల గిడ్డంగుల్లో భౌతికంగా ఉన్నాయా లేదా అనేది ఇప్పుడు మిస్టరీగా మారింది.చాలా మిల్లుల్లో గోనె సంచులు ఖాళీగా ఉన్నాయని, ధాన్యాన్ని వేరే ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకున్నారనే ప్రచారం బలంగా జరుగుతోంది.ఇంత పెద్దమొత్తంలో బకాయిలు పేరుకుపోవడానికి పౌరసరఫరాల శాఖ అధికారుల అలసత్వమే కారణమనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. రోజు వారీగా మిల్లులను తనిఖీ చేయడంలో అధికారులు విఫలమయ్యారా? బకాయిలు పెరిగిపోతున్నా ముందస్తు హెచ్చరికలు ఎందుకు జారీ చేయలేదు?

### 'మమకారం' వల్లనే రికవరీ మందగించిందా?

గడువు ముగిసే సమయానికి బకాయిలు రాబట్టకపోతే బాధ్యులైన అధికారులపై కూడా చర్యలు తప్పవని సమాచారం అందుతుండటంతో, ఇప్పుడు యంత్రాంగం పరుగులు తీస్తోంది.మరో ఆరు రోజుల్లో గడువు ముగియనుండటంతో జిల్లా యంత్రాంగం కఠిన చర్యలకు ఉపక్రమిస్తున్నట్లు తెలుస్తోంది. పౌర సరఫరాల శాఖ వర్గాల సమాచారం ప్రకారం రాబోయే ఆరు రోజులగడువులోగా బియ్యం అప్పగించని మిల్లర్లపై రెవెన్యూ రికవరీ యాక్ట్ కింద కేసులు నమోదు చేసి, మిల్లులను జప్తు చేసే యోచనలో ఉన్నారు.జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలు ప్రైవేట్ రైస్ మిల్లుల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టనున్నాయి.సమయానికి సీఎంఆర్ ఇవ్వని మిల్లులను శాశ్వతంగా 'బ్లాక్ లిస్ట్'లో పెట్టి, రాబోయే సీజన్లలో ధాన్యం కేటాయింపులను నిలిపివేసేందుకు సిద్ధమవుతున్నారు.పక్కదారి పట్టించినట్లు తేలితే క్రిమినల్ కేసులు నమోదు చేసేందుకు సైతం వెనుకాడబోమని అధికారులు హెచ్చరిస్తున్నారు.కోట్లాది రూపాయల ప్రభుత్వ సొత్తు పక్కదారి పడుతుంటే చూస్తూ ఊరుకునేది లేదని జిల్లా యంత్రాంగం చెబుతున్నప్పటికీ... ఈ ఆరు రోజుల్లో రూ. 90 కోట్ల బకాయిలను ఏ విధంగా రాబడతారనేది ఇప్పుడు మానుకోట జిల్లా వ్యాప్తంగా ఆసక్తికరంగా మారింది. మిల్లర్ల నెత్తిపై కత్తిలా మారిన ఈ గడువులోగా సిఎంఆర్ పూర్తి అవుతుందా? లేక అధికారులు ఉక్కుపాదం మోపి మిల్లులకు సీళ్లు వేస్తారా అనేది వేచి చూడాలి...!

---

## రానున్న మూడు రోజులు తెలంగాణలో భారీ వర్షాలు

**ప్రభాత గమనం, హైదరాబాద్ :**



వాయవ్య బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం ప్రభావంతో తెలంగాణ అంతటా భారీ వర్షాలు కురుస్తున్నాయి. మరో రెండు మూడు రోజులవరకు దాని ప్రభావం అధికంగానే ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరిస్తున్నది. కాగా, భారీ నీటి జలాశయాల సమీపంలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికార యంత్రాంగం కూడా హెచ్చరిస్తున్నది. వరుణ దేవుడికోసం ఎదురు చూస్తున్న తెలంగాణ ప్రజలకు గత కొద్ది రోజులుగా పడుతున్న వర్షాలు కొంత ఊరట ఇచ్చిందని చెప్పాలె. వర్షాకాలం గడచిపోతున్న వానల సూచనలు లేకపోవడంతో రైతాంగం దిగాలు పడిపోయారు. అధికార యంత్రాంగం కూడా వరిలాంటి నీటి ఆధార పంటలకు ప్రత్యమ్నాయ పంటలను వేసుకోవాలన్న సూచనలు చేస్తున్నారు. అయితే ఇటీవల తెలంగాణ వ్యాప్తంగా పలు జిల్లాల్లో భారీగా వర్షాలు పడడంతో పలు ప్రాంతాల్లో రైతులు సాగుకు ఉపక్రమిస్తున్నారు. కాగా కొన్ని జిల్లాలో అతిభారీ వర్షాలు పడుతుండడంతో వాతావరణశాఖ ప్రజలను అప్రమత్తం చేస్తున్నది. ఆగస్టు మూడవ తేదీవరకు జాగ్రత్తగా ఉండాలంటున్నారు. ఎందుకంటే ఇప్పటికే కొన్ని జిల్లాల్లో వాగులు, చెరువులు పొంగి పొర్లుతున్నాయి. మరికొన్ని చోట్ల నీటి ప్రవాహానికి రోడ్లు కొట్టుకుపోయి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. నిజాంసాగర్, జూరాల వంటి భారీ ప్రాజెక్టుల్లోకి భారీగా వరదనీరు చేరుకుంటున్నది. కడెం, ఎల్లంపల్లి ప్రాజెక్టులకు నీరు పోటెత్తుతున్నది. కుమ్రంభీమ్ జిల్లాలో బాహుబలి జలపాతం ఉప్పొంగుతున్నది. భద్రాద్రి జిల్లా చర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్టులోకి భారీగా నీరు చేరుకుంటున్నది. ఇప్పటికే అక్కడ 30 గేట్లు ఎత్తి నీటిని దిగువకు తరలిస్తున్నారు. రామగుండం పారిశ్రామిక ప్రాంతమంతా జలమయమైంది. సింగరేణి ప్రాంతంలో ఉపరితల బొగ్గు ఉత్పత్తికి అంతరాయం కలిగింది. దీంతో రానున్న రెండు రోజులుకూడా కీలకంగా భావిస్తున్నారు. చాలా జిల్లాల్లో తేలికపాటినుంచి తీవ్ర గాలులతోకూడిన భారీ వర్షం పడే అవకాశాలున్నట్లు వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ జిల్లాల్లో కనీసం వందనుంచి 120 మిల్లీ మీటర్ల వర్షపాతం నామోదు కావచ్చని అంచనా వేస్తున్నారు. కాగా హనుమకొండ, భూపాలపల్లి జయశంకర్, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాలను వాతవరణశాఖ ఇప్పటికే అరెంజ్ అలర్ట్ ప్రకటించింది. అలాగే ఆదిలాబాద్, భద్రాచలం కొత్తగూడెం, హైదరాబాద్, జనగామ, కామారెడ్డి, ఖమ్మం, కుమురం భీమ్, మేడ్చల్, మహబూబాబాద్, మంచిర్యాల, మెదక్, ములుగు, సంగారెడ్డి, సిద్దిపేట, సూర్యాపేట, వరంగల్, యాదాద్రి జిల్లాలను ఎల్లో అలర్ట్‌గా ప్రకటించారు.

---

## శాకంబరి అలంకరణలో భద్రకాళీ అమ్మవారు

**వరంగల్ , ప్రభాతగమనం, జూలై 29:**

శ్రీ భద్రకాళీ దేవస్థానంలో గత పదిహేను రోజులుగా జరుగుతున్న రాకంతా దీక్షా పూర్వక శాకంభరీ నవరాత్రులు బుధవారంతో ముగిశాయి. పదిహేనవ రోజు ఆషాడ శు। పౌర్ణమి రోజున అమ్మవారిని శాకంభరిగా అలంకరించి పూజారాధనలు జరిపారు. అమ్మవారి దర్శనానికి దేవస్థానం వారు అనుమతించగానే కట్టలు తెంచుకున్న ఆనందంతో గుడిలోపలికి వచ్చి శాకంభరీ అలంకారములో ఉ న్న అమ్మవారిని దర్శించుకొని భక్తులు పులకించిపోయారు. దేవస్థానం ప్రాంగణం అంతా భద్రకాళి శరణం మమ, శాకంభరీ శరణం మమ అనే నామ స్మరణతో మారుమ్రోగింది. ఆలయ ఈఓ రామల సునీత పోలీసు, ప్రభుత్వ శాఖల సమన్వయంతో జరిపిన ఏర్పాట్లు భక్తుల ప్రశంసలకు పాత్రమయ్యాయి. వేలాదిమంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని, సుమారు 4000 కిలోల కూరగాయలు, పండ్లు సేకరించి దండలుగా చేసి అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. శాకంభరీ అంకరణ హన్మకొండ టీచర్స్ కాలనీ వాసి, పవర్ ఇన్స్టాలేషన్స్ కాంట్రాక్టరు డాక్టర్ మండువ శేషగిరిరావు–రేణుక దంపతులు, హైదరాబాదు వాస్తవ్యులు ఈమని హరికృష్ణ–స్మిత దంపతులు సౌజన్యంతో జరిగింది. పోలీసు శాఖవారు. ఎన్.సి.సి వాలంటర్లు, శ్రీలక్ష్మీవెంకటేశ్వర, లక్ష్మి శ్రీనివాస సేవా సమితి సభ్యులు భక్తులుకు క్యూలైన్లలో సేవలందించించారు. భద్రకాళి సేవానమితి కన్వీనర్ అయితే గోపీనాథ్ అధ్వర్యనంలో వేలాది మంది భక్తులకు ప్రసాద వితరణ జరిపారు. దేవాలయములో మార్వాడీ మిత్రమండలి ఆధ్వర్యంలో దేవాలయమునకు విచ్చేసిన భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. అనంతరం శాకంభరీ నవరాత్రుల పూర్ణాహుతి కార్యక్రమం జరిగింది. శాకంభరీ నవరాత మహోత్సవములు విజయవంతం కావడానికి సహకరించిన ప్రింట్, అధికారులు, సిబ్బంది, సహకరించిన సకల జనులకు ఆలయ ఈఓ రామల సునీత ధన్యావాదములు తెలియజేశారు.



# బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ వెంటనే క్షమాపణ చెప్పాలి

- తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**



జంతర్ మంతర్ వద్ద నిరసన చేపట్టిన జెన్ జి మహిళలపై బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ చేసిన వ్యాఖ్యలు అత్యంత దారుణమైనవి, బాధ్యతారహితమైనవని తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ మండిపడ్డారు. మహిళలను అవమానించేలా చేసిన వ్యాఖ్యలను తెలంగాణ మహిళా కాంగ్రెస్ తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆమె తెలిపారు. బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఆమె మాట్లాడుతూ, నిరసనలో పాల్గొన్న మహిళలను "చదువుకోని వారు, మంచి గృహిణులు కూడా కాలేరు, గటార్ చాప్" అంటూ కించపరిచేలా వ్యాఖ్యానించడం ఒక ప్రజా ప్రతినిధికి ఏమాత్రం తగదన్నారు. మహిళల హక్కుల కోసం పోరాడుతున్న జెన్ జి యువతులపై పోలీసులు అమానుషంగా లాఠీచార్జ్ చేసి దాడులకు పాల్పడగా, ఆ ఘటన అనంతరం వారిని మరింత అవమానించేలా మాట్లాడటం కంగనా రనౌత్ సంస్కారాన్ని తెలియజేస్తోందని విమర్శించారు. జెన్ జి మహిళలతో విభేదించడం ద్వారా కంగనా రనౌత్ తప్పు దారిలో నడుస్తున్నారని ఆమె అన్నారు. మహిళగా ఉండి మహిళలనే కించపరిచే వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని పేర్కొన్నారు. రైతు ఉద్యమం సందర్భంగా మహిళా రైతులపై చేసిన వివాదాస్పద వ్యాఖ్యల నేపథ్యంలో కంగనా రనౌత్‌కు ఎదురైన పరిణామాలను గుర్తు చేస్తూ, ప్రజలను అవమానించే ధోరణిని విడనాడాలని సూచించారు. పార్లమెంట్ సభ్యురాలిగా ప్రజా సమస్యలపై మాట్లాడాల్సిన బాధ్యతను విస్మరించి మహిళలను కించపరచడం ఆమె నిజస్వరూపాన్ని బయటపెడుతోందని ఎర్రబెల్లి స్వర్ణ విమర్శించారు. వెంటనే జెన్ జి మహిళలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో నైతిక బాధ్యత వహించి ఎంపీ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని, మహిళల పట్ల గౌరవప్రదమైన భాషను పాటించాలని ఎర్రబెల్లి స్వర్ణ స్పష్టం చేశారు.




# ములుగు పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ ఆకస్మిక తనిఖీ

- కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలి
- మత్తు పదార్థాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశాలు

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

ములుగు పోలీస్ స్టేషన్‌లో బుధవారం డీఎస్పీ ఎన్. రవీందర్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. స్టేషన్‌లోని వివిధ రికార్డులను పరిశీలించిన ఆయన, పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తును వేగవంతం చేసి బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రౌడీ షీటర్లు, కేడీ షీటర్ల కదలికలపై నిరంతర నిఘా కొనసాగిస్తూ, వారి ప్రవర్తనను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. నేరాల నియంత్రణలో ఎలాంటి అలసత్వానికి తావు లేకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. యువత, విద్యార్థులు గంజాయి సహా మత్తు పదార్థాలకు బానిస కాకుండా ఉండేందుకు పాఠశాలలు, కళాశాలలు, గ్రామాల్లో నిరంతర అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని డీఎస్పీ తెలిపారు. మత్తు పదార్థాల నిర్మూలనలో ప్రజల సహకారం కూడా కీలకమని ఆయన పేర్కొన్నారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించిన డీఎస్పీ, పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇస్తూ 5ఎస్ విధానాన్ని సమర్థంగా అమలు చేయాలని సూచించారు. తనిఖీ సందర్భంగా సీఐ దారం సురేష్, ఎస్‌హెచ్‌ఓ ఎస్. వెంకటేష్, మహిళా ఎస్ఐ రచిత్రతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



# ఎరువుల పరీక్షా కేంద్ర భవనాన్ని పరిశీలించిన కలెక్టర్

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

రాష్ట్రంలో రాజేంద్రనగర్ తర్వాత వరంగల్‌లో ఏర్పాటు చేసిన రెండో ఎరువుల పరీక్షా కేంద్రం (ఎఫ్‌సీఓ ల్యాబ్) నూతన భవనం ప్రారంభోత్సవానికి సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో పైడిపల్లి రైతు శిక్షణ కేంద్రం ఆవరణలో నిర్మించిన భవనాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద బుధవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రయోగశాల గదులు, విద్యుత్, తాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్యం తదితర మౌలిక వసతులను కలెక్టర్ పరిశీలించి, నిర్మాణంలో ఉన్న లోపాలను వెంటనే సరిచేసి నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా అన్ని పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రారంభోత్సవానికి ఎలాంటి లోటుపాట్లు లేకుండా భవనాన్ని అన్ని విధాలుగా సిద్ధం చేయాలని సూచించారు. ప్రస్తుతం ప్రైవేట్ భవనంలో కొనసాగుతున్న ఎరువుల పరీక్షా కేంద్రాన్ని త్వరలోనే ఈ నూతన భవనానికి తరలించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. అలాగే భవన నిర్మాణంలో ఉన్న అన్ని లోపాలను పూర్తిగా సరిదిద్దిన అనంతరం చేపట్టిన చర్యలపై సమగ్ర నివేదికను వెంటనే సమర్పించాలని పంచాయతీరాజ్ శాఖ డివిజనల్ ఇంజనీర్‌ను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ పరిశీలనలో జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమల అధికారి, జిల్లా వ్యవసాయ అధికారి, పంచాయతీరాజ్ శాఖ డివిజనల్ ఇంజనీర్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పులుల సంరక్షణ పట్ల బాధ్యతగా ఉండాలి

- మంత్రి కొండా సురేఖ
- అంతర్జాతీయ పులుల దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న మంత్రి

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**




పులుల సంరక్షణ పట్ల సమాజంలోని అన్ని వర్గాలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు. ఈ భూమి కేవలం మనుషులకే కాదు, సమస్త జీవరాశుల ఉమ్మడి నివాసమని గుర్తించి ప్రకృతి పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా దూలపల్లిలోని తెలంగాణ స్టేట్ ఫారెస్ట్ అకాడమీలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పులుల ఫోటో ప్రదర్శనను పరిశీలించడంతో పాటు, పులుల సంరక్షణపై రూపొందించిన లఘు చిత్రాన్ని వీక్షించారు. అనంతరం జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం జూలై 29న ప్రపంచ పులుల దినోత్సవాన్ని నిర్వహించడం ద్వారా పులుల సంరక్షణ ప్రాధాన్యతపై ప్రపంచవ్యాప్తంగా అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు. 2010లో రష్యాలోని సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో ప్రారంభమైన ఈ కార్యక్రమం నేడు ప్రకృతి పరిరక్షణకు కీలక వేదికగా మారిందన్నారు. పులి అటవీ సంపదకు ప్రతీక అని, పులులను రక్షించడం అంటే అడవులు, పర్యావరణం, జీవవైవిధ్యం, భావితరాల భవిష్యత్తును కాపాడటమేనని మంత్రి పేర్కొన్నారు. వేట, అడవుల నరికివేత, అక్రమ రవాణా కారణంగా పులుల సంఖ్య తగ్గిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. నాటి ప్రధాని ఇందిరా గాంధీ నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం 1972లో వన్యప్రాణి సంరక్షణ చట్టాన్ని తీసుకురావడంతో పాటు, 1973లో "ప్రాజెక్ట్ టైగర్" ప్రారంభించి దేశవ్యాప్తంగా పులుల సంరక్షణకు బలమైన పునాది వేసిందని తెలిపారు. ప్రస్తుతం ప్రపంచంలోని పులుల్లో సుమారు 75 శాతం భారతదేశంలోనే ఉండగా, దేశంలో 58 టైగర్ రిజర్వులు విజయవంతంగా పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. తెలంగాణలో అమ్రాబాద్, కవ్వాల్ టైగర్ రిజర్వులు దేశంలోనే ప్రముఖ పులుల అభయారణ్యాలుగా గుర్తింపు పొందాయని మంత్రి తెలిపారు. అమ్రాబాద్‌లో నీటి వనరుల అభివృద్ధి, ఆవాసాల పరిరక్షణ, ఆధునిక రక్షణ చర్యల వల్ల పులుల సంఖ్య పెరిగిందన్నారు. కవ్వాల్ టైగర్ రిజర్వులో పులుల సంఖ్య పెంపు కోసం టైగర్ రీ–ఇంట్రడక్షన్ కార్యక్రమాన్ని చేపట్టి, మహారాష్ట్రలోని తడోబా టైగర్ రిజర్వుతో అనుసంధానం చేసి పులుల సహజ సంచారానికి అనుకూల పరిస్థితులు కల్పించినట్లు వివరించారు. అడవులను, వన్యప్రాణులను పరిరక్షించి భావితరాలకు పచ్చని తెలంగాణను అందించాలని మంత్రి పిలుపునిచ్చారు. పులుల సంరక్షణలో అటవీ శాఖతో పాటు ప్రతి పౌరుడు తన బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ అకాడమీలో శిక్షణ పొందుతున్న మహారాష్ట్ర, ఒడిశా, మధ్యప్రదేశ్, కేరళ రాష్ట్రాల అభ్యర్థులను ఉద్దేశించి అటవీ సంపద పరిరక్షణలో నిబద్ధత, నిజాయితీతో పనిచేయాలని మంత్రి సూచించారు. అటవీ సంపద, వన్యప్రాణుల సంరక్షణలో విశేష కృషి చేసిన అటవీ శాఖ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు, నగదు బహుమతులు అందజేశారు. అలాగే అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అటవీదళాల ప్రధాన సంరక్షణాధికారి వినయ్ కుమార్, కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్ డా. దండా రాజిరెడ్డి, పీసీసీఎఫ్ (డెవలప్‌మెంట్) రత్నాకర్ జౌహరి, టీజీఎస్ఎఫ్ఏ డైరెక్టర్ ప్రియాంక వర్గీస్, సీసీఎఫ్ ఎన్. క్షితిజ్, టైగర్ సెల్ రీసెర్చ్ సైంటిస్ట్ అయాన్ సాధు, అమ్రాబాద్ ఫీల్డ్ డైరెక్టర్ ప్రసాద్, కవ్వాల్ టైగర్ రిజర్వ్ ఫీల్డ్ డైరెక్టర్ శాంతారాం తదితరులు పాల్గొన్నారు.

# పోగొట్టుకున్న ఐఫోన్ బాధితుడికి అప్పగింత

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

కాజీపేట ట్రాఫిక్ పోలీసుల అప్రమత్తతతో పోగొట్టుకున్న ఆపిల్ (ఐఫోన్) మొబైల్ ఫోన్‌ను గుర్తించి యజమానికి అప్పగించారు. బుధవారం కాజీపేట జంక్షన్‌లో ట్రాఫిక్ ఎస్ఐ బి. మంగా వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో ఓ ఆపిల్ మొబైల్ ఫోన్ కనిపించింది. అక్కడే విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ సారయ్య ఆ ఫోన్‌ను ఎస్ఐ మంగాకు అందజేశారు. అనంతరం పోలీసులు అవసరమైన ధృవీకరణ ప్రక్రియను పూర్తి చేసి, అసలు యజమానిని గుర్తించి మొబైల్ ఫోన్‌ను అప్పగించారు. తనకు ఎంతో విలువైన మొబైల్ ఫోన్ తిరిగి అందడంతో బాధితుడు ఆనందం వ్యక్తం చేస్తూ, నిజాయితీతో వ్యవహరించిన కాజీపేట ట్రాఫిక్ ఎస్ఐ బి. మంగా, హెడ్ కానిస్టేబుల్ సారయ్యతో పాటు పోలీసు సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కాజీపేట ట్రాఫిక్ పోలీసులు ప్రజలకు సూచనలు చేస్తూ, మొబైల్ ఫోన్‌లు లేదా ఇతర విలువైన వస్తువులు పోయిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని, అలా చేయడం వల్ల వాటిని త్వరగా గుర్తించి యజమానులకు అందజేయడం సులభమవుతుందని తెలిపారు.



# కరెంట్ షాక్ తో నాలుగు బర్రెలు మృతి

- కేయూ క్యాంపస్ లో ఘటన

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

కాకతీయ యూనివర్సిటీ లేడీస్ హాస్టల్ సమీపంలో బుధవారం విషాదకర ఘటన చోటుచేసుకుంది. ఎల్‌టీఈ విద్యుత్ లైన్ వైరు తెగి మేత మేస్తున్న బర్రెలపై పడటంతో నాలుగు బర్రెలు మృతి చెందాయి. పోలీసుల వివరాల ప్రకారం, ప్రమాదంలో రెండు పెద్ద బర్రెలు, రెండు దూడలు అక్కడికక్కడే విద్యుదాఘాతానికి గురై మృతి చెందాయి. ఘటనపై సమాచారం అందుకున్న కాకతీయ యూనివర్సిటీ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతిచెందిన బర్రెలు ఎవరివో ఇప్పటివరకు గుర్తించలేదని పోలీసులు తెలిపారు. బర్రెల యజమానులు లేదా వాటి గురించి సమాచారం తెలిసిన వారు వెంటనే కాకతీయ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని ఇన్స్పెక్టర్ రవి కుమార్ కోరారు. సమాచారం అందించాల్సిన ఫోన్ నంబర్లు: 8712584607, 8712685004. ఈ ఘటనపై పోలీసులు విచారణ చేపట్టగా, విద్యుత్ శాఖ అధికారులు కూడా ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు. స్థానికులు విద్యుత్ తీగల నిర్వహణలో నిర్లక్ష్యం కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు.



# పంట మార్పిడి విధానాన్ని అవలంబించాలి

- మండల వ్యవసాయ అధికారి వెంకన్న
- ఎల్నినో ప్రభావంపై రైతులకు సలహాలు సూచనలు

**కేసముద్రం, జూలై 29(ప్రభాత గమనం):**



వర్షపాతం తక్కువ నమోదు అయ్యే అవకాశం ఉన్నందున వరికి బదులు ఆరుతడి పంటలు వేసుకోవాలని, పంట మార్పిడి విధానాన్ని అవలంబించాలని కేసముద్రం మండల వ్యవసాయ అధికారి వెంకన్న సూచనలు చేశారు. బుధవారం కేసముద్రం రైతు వేదిక యందు వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ, ఐకెపి ఆధ్వర్యంలో కేసముద్రం రైతు వేదికలో ఎల్నినో ప్రభావం వలన ఈ వానకాలం 2026-27 సీజన్లో వాతావరణ శాఖ ఆదేశాల మేరకు వర్షపాతం తక్కువ నమోదు అయ్యే అవకాశం ఉన్నందున వరికి బదులు ఆరుతడి పంటలు వేసుకోవాలని, పంట మార్పిడి విధానాన్ని అవలంబించాలని మండల వ్యవసాయ అధికారి కేసముద్రం బి వెంకన్న, ఉద్యానవన అధికారి శాంతి ప్రియ, ఐకెపి ఎపిఎం కృష్ణమూర్తి రైతులకు పలు సలహాలు సూచనలు ఇవ్వడం జరిగింది. అదే విధంగా రాయితీపై తక్కువ నీటితో పండించే ఆరుతడి పంటలైన పెసర, కందులు, కూరగాయల విత్తనాలను రైతులకు సరఫరా చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి కేసముద్రం రాజీవ్ లోచన్, ఉద్యాన శాఖ విస్తరణ అధికారి రమేష్ , ఐకెపి సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# ట్రైనీ ఐపీఎస్ కృష్ణారెడ్డికి 14రోజుల రిమాండ్

- చంచల్‌గూడ జైలుకు తరలించిన పోలీసులు
- మహిళా ట్రైనీ ఐపిఎస్‌ను ఘోరంగా వేధించినట్లు రుజువులు

**హైదరాబాద్,ప్రభాతగమనం,జూలై29:**



తోటి మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారిపై లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న ట్రైనీ ఐపీఎస్ అధికారి ఉదయ్‌కృష్ణారెడ్డిని పోలీసులు మిర్యాలగూడలో మంగళవారం అదుపులోకి తీసుకుని ఉమెన్ సేఫ్టీ వింగ్‌కు అప్పగించారు. ఉదయ్ కృష్ణారెడ్డికి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. ఉదయ్‌కృష్ణారెడ్డిని బుధవారం ఉప్పర్ పల్లి కోర్టులో హాజరపరుచగా.. న్యాయమూర్తి అతడికి ఆగస్టు 11 వరకు రిమాండ్ విధిస్తూ తీర్పునిచ్చారు. కోర్టు ఆదేశాల మేరకు ఉదయ్ కృష్ణారెడ్డిని పోలీసులు భారీ భద్రత మధ్య చంచల్ గూడ జైలుకు తరలించారు. మహిళా ట్రైనీ ఐపీఎస్‌పై ఉదయ్‌కృష్ణారెడ్డి దాడి చేసినట్టు వైద్యపరీక్షల్లో నిర్ధారణ అయినట్టు తెలిసింది. కేసు నమోదైన జూలై 18న బాధితురాలికి వైద్య పరీక్షలు నిర్వహించిన డాక్టర్లు ఆమెపై భౌతికంగా దాడి జరిగినట్టు తేల్చారు. బాధితురాలి గొంతు నులిమినట్టు గాయాల ఆనవాళ్లు, చెంప భాగంలో కొట్టిన కమిలిన గాయాలు, ఎడమ కాలిపైనా గాయం ఉన్నట్టు సమాచారం. నేషనల్ పోలీస్ అకాడలో తోటి ట్రైనీ ఐపీఎస్ అధికారిణి ఇచ్చిన ఫిర్యాదుతో నమోదు అయిన ఎఫ్ఐఆర్ లో దిగ్భ్రాంతికర అంశాలు వెలుగులోకి వచ్చాయి. బాధితురాలు అందించిన వివరాల ప్రకారం నిందితుడు ఉదయ్ కృష్ణారెడ్డి ఆమెపై మానసికంగా, శారీరకంగా తీవ్ర స్థాయిలో వేధింపులకు పాల్పడినట్లు తెలుస్తోంది. బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్న దాని ప్రకారం ఉదయ్ కృష్ణారెడ్డి ఆమెను వాట్సాప్ ద్వారా లైంగికంగా వేధించడమే కాకుండా, వారిద్దరి మధ్య రిలేషన్ షిప్ ఉందంటూ తోటి ట్రైనీ ఐపీఎస్ అధికారుల వద్ద అసత్య ప్రచారాలు చేశాడు. అంతటితో ఆగకుండా, మరో ట్రైనీ అధికారితో ఆమెకు అక్రమ సంబంధం ఉందంటూ నిరాధారమైన ఆరోపణలు చేస్తూ అవమానించాడు. బాధితురాలిని అత్యంత అసభ్యకరమైన పదాలతో దూషిస్తూ మానసిక క్షోభకు గురిచేసినట్లు సమాచారం. బాధితురాలికి తెలియకుండానే ఆమె వ్యక్తిగత వీడియోలను రికార్డు చేసిన ఉదయ్, వాటి ఆధారంగా ఆమెను బ్లాక్‌మెయిల్ చేయడానికి యత్నించాడని బాధితురాలు పేర్కొంది. ఆ వీడియోలను ఆమె భర్తకు పంపించి తీవ్ర మనోవేదన కలిగించాడు. అంతేకాకుండా ఆమె మొబైల్ ఫోన్‌ను బలవంతంగా తన గదికి తీసుకెళ్లి, పాస్‌వర్డ్ చెప్పాలంటూ బెదిరింపులకు పాల్పడ్డాడని బాధితురాలు తెలిపింది. అదే సమయంలో ఆమెను అసభ్యకరం గా తాకుతూ, తీవ్రంగా వేధించినట్లు ఫిర్యాదులో నమోదైంది. ఈ నెల 9వ తేదీ రాత్రి బాధితురాలిని బలవంతంగా తన గదికి తీసుకెళ్లి బంధించిన ఉదయ్ కృష్ణారెడ్డి, ఆమె జుట్టు పట్టుకుని లాగి, గొంతు నులిమేందుకు ప్రయత్నించాడు. గది నుంచి బయటకు వెళ్లకుండా మెడపై కత్తి పెట్టి భయభ్రాంతులకు గురిచేశాడు. ఆమెను అవమానించే ఉద్దేశంతో మూడు కండోమ్ ప్యాకెట్లను ఆమెపైకి విసిరాడు. అనంతరం ఈ నెల 10వ తేదీ ఉదయం కూడా ఆమెపై తీవ్రంగా శారీరక దాడికి పాల్పడ్డాడు. అకాడలో ఇతరుల సమక్షంలోనూ అసభ్యకరంగా మాట్లాడి ఆమె పరువుకు భంగం కలిగించాడని బాధితురాలు తెలిపింది. ఈ ఘటనలపై సమగ్ర విచారణ జరిపి నిందితుడిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు.

# తెలంగాణ ప్రాజెక్టులకు భారీ ఊరట

- పర్యావరణ అనుమతులు చెల్లుబాటు
- సుప్రీంకోర్టులో ఉపశమనం

**న్యూఢిల్లీ,ప్రభాతగమనం, జూలై29:**

తెలంగాణలోని పాలమూరు–రంగారెడ్డి, సీతమ్మ సాగర్, గౌరవెల్లి రిజర్వాయర్ వంటి కీలక సాగునీటి ప్రాజెక్టులకు సుప్రీంకోర్టు భారీ ఉపశమనం కల్పించింది. కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ 2021లో జారీ చేసిన ఆఫీస్ మెమోరాండంను సుప్రీంకోర్టు కొట్టివేసినా.. ఆ ఉత్తర్వు ఆధారంగా ఇప్పటికే మంజూరైన పర్యావరణ అనుమతులన్నీ పూర్తిగా చెల్లుబాటులోనే ఉంటాయని స్పష్టం చేసింది. ఈ తీర్పు భవిష్యత్తుకు మాత్రమే వర్తిస్తుందని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్ నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. దీంతో తెలంగాణలో కొనసాగుతున్న ఈ కీలక సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాలకు ఎలాంటి చట్టపరమైన ఆటంకం ఉండదని స్పష్టత వచ్చింది. అదే సమయంలో భవిష్యత్తులో చేపట్టే కొత్త ప్రాజెక్టులకు ముందస్తు పర్యావరణ అనుమతులు తప్పనిసరిగా ఉండాలని న్యాయస్థానం పేర్కొంది. కార్యనిర్వాహక ఉత్తర్వుల ద్వారా చట్టాలను భర్తీ చేయడం సాధ్యంకాదని వ్యాఖ్యానించిన ధర్మాసనం.. అత్యవసర పరిస్థితుల్లో మినహాయింపులు ఇవ్వాలంటే కేంద్రప్రభుత్వం చట్టబద్ధమైన నోటిఫికేషన్ జారీ చేయాల్సిందేనని సూచించింది. ఇప్పటికే పూర్తయిన లేదా నిర్మాణంలో ఉన్న కీలక ప్రాజెక్ట్ పనులకు ఎలాంటి అంతరాయం ఉండదని న్యాయస్థానం పేర్కొనడంతో తెలంగాణ ప్రభుత్వం, సాగునీటి ప్రాజెక్టులకు ఇది కీలక ఊరటనిచ్చిన తీర్పుగా భావిస్తున్నారు.

# డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలి

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి
- బీఎల్‌వోలు నమోదు చేసిన వివరాలను ఈఆర్‌వోలు, సూపర్‌వైజర్లు తప్పనిసరిగా పునః ధృవీకరణ చేయాలి
- ఓటరు జాబితాకు సంక్షేమ పథకాలతో ఎలాంటి సంబంధం లేదని ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలి
- మరో రెండు రోజుల్లో అన్ని డేటా లోపాలను సరిదిద్దాలి..
- లేని పక్షంలో బాధ్యులపై చర్యలు తప్పవు
- జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్




**మహబూబాబాద్ జులై 29(ప్రభాత గమనం):**

ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమంలో ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణకు మరికొద్ది రోజులే మిగిలి ఉన్నందున ఓటర్ల వివరాల డిజిటలైజేషన్‌ను వేగవంతం చేయడంతో పాటు బీఎల్‌వోలు నమోదు చేసిన వివరాల్లో ఉన్న లోపాలను వెంటనే సరిదిద్దాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులను ఆదేశించారు. బుధవారం, హైదరాబాద్ నుంచి ఎస్ఐఆర్ కార్యక్రమం పురోగతి, ఓటర్ల వివరాల డిజిటలైజేషన్, డేటా నమోదు, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, తదితర అంశాలపై అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి అదనపు కలెక్టర్ రెవెన్యూ కె.అనిల్ కుమార్, మహబూబాబాద్, తొర్రూరు రెవెన్యూ డివిజనల్ అధికారులు రాజేశ్వరి, గణేష్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నితీష్ కుమార్, లతో కలిసి జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ ఈ వీడియో కాన్ఫరెన్స్ కు హాజరయ్యారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణకు కేవలం నాలుగు నుంచి ఐదు రోజుల సమయం మాత్రమే మిగిలి ఉందన్నారు. ఓటర్ల నుంచి సేకరించిన అన్ని ఎన్యూమరేషన్ ఫారాలను వెంటనే డిజిటలైజ్ చేయాలని ఆదేశించారు. బీఎల్‌వోలు వెబ్‌సైట్‌లో ఓటర్ల వివరాలు నమోదు చేసే సమయంలో అనేక పొరపాట్లు జరిగినట్లు గుర్తించామని, వాటి కారణంగా అర్హులైన ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగిపోతున్నాయనే ఫిర్యాదులు పెద్ద ఎత్తున అందుతున్నాయని తెలిపారు. అందువల్ల బీఎల్‌వోలు నమోదు చేసిన ప్రతి వివరాన్ని ఈఆర్‌వోలు, సూపర్‌వైజర్లు తప్పనిసరిగా పునః ధృవీకరణ చేయాలని, యాదృచ్ఛికంగా ఓటర్ల వివరాలను పరిశీలించి, అన్ని లోపాలను మరో రెండు రోజుల్లోగా సరిదిద్దాలని ఆదేశించారు. అనంతరం తప్పిదాలు గుర్తిస్తే సంబంధిత బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పట్టణ ప్రాంతాల్లో డిజిటలైజేషన్ ప్రక్రియ ఇంకా పెండింగ్‌లో ఉందని, సూపర్‌వైజర్లు బీఎల్‌వోలతో నిరంతరం సమన్వయం చేసుకొని, పనులను వేగవంతం చేయాలని సూచించారు. ముఖ్యంగా రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ జిల్లాల్లో డిజిటలైజేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 8 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 100 శాతం డిజిటలైజేషన్ పూర్తికాగా, 80 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 90 శాతానికి పైగా డిజిటలైజేషన్ పూర్తయిందన్నారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ (రేషనలైజేషన్) ప్రక్రియను కూడా సమాంతరంగా పూర్తి చేయాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ వల్ల ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రభావం ఉంటుందనే తప్పుడు ప్రచారం జరుగుతోందని, ఓటరు జాబితాకు సంక్షేమ పథకాలతో ఎలాంటి సంబంధం లేదని ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలని జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. ఈ తప్పుడు ప్రచారాన్ని వెంటనే ఖండించాలని, బీఎల్‌వోలతో తరచూ సమావేశాలు నిర్వహిస్తూ, ఎస్ఐఆర్ పురోగతిని సమీక్షించాలని సూచించారు. అలాగే అన్ని స్థాయిల్లో రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించి ఎస్ఐఆర్ పురోగతిని వివరించాలని తెలిపారు. పోలింగ్ స్టేషన్‌ల వారీగా ముసాయిదా ఓటరు జాబితాను బూత్ లెవల్ ఏజెంట్లకు (బీఎల్ఏ) అందజేసి, వారి సంతకాలను తప్పనిసరిగా తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ వివరిస్తూ.. జిల్లాలో వేగంగా డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తి చేస్తున్నామని వివరించారు. రెండు రోజుల్లో వంద శాతం డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తి చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్ (హేతుబద్ధీకరణ) ప్రక్రియ కూడా చేపట్టడం జరిగిందన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ వివరిస్తూ.. జిల్లాలో వేగంగా డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తి చేస్తున్నామని వివరించారు. రెండు రోజుల్లో వంద శాతం డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తి చేయడం జరుగుతుందన్నారు.జిల్లాలో పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్ (హేతుబద్ధీకరణ) ప్రక్రియ కూడా చేపట్టడం జరిగిందన్నారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ మాట్లాడుతూ.. డిజిటలైజేషన్ ప్రక్రియకు గడువు 4, 5 రోజులు మాత్రమే మిగిలి ఉందని, వేగవంతంగా పూర్తి చేయాలని, అదే సమయంలో తప్పులు లేకుండా ఉండేందుకు ఈఆర్‌ఓలు యాదృచ్ఛిక తనిఖీలు చేసి పూర్తిస్థాయిలో లక్ష్యం చేయడానికి పూర్తిస్థాయిలో పనిచేయాలని ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ రెవెన్యూ కె.అనిల్ కుమార్, మహబూబాబాద్, తొర్రూరు ఆర్డీవోలు రాజేశ్వరి, గణేష్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నితీష్ కుమార్, ఎన్నికల విభాగం సిబ్బంది రాజు, రంజిత్,తదితరులు పాల్గొన్నారు.




## ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలి

- కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రజలకు నాణ్యమైన, సకాలంలో వైద్య సేవలు అందేలా వైద్యాధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచడంతో పాటు మాతా-శిశు ఆరోగ్య సేవలను మరింత మెరుగుపర్చాలని ఆదేశించారు. బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉన్నత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆర్‌బీఎస్‌కే బృందాలు, సంబంధిత వైద్యాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో మాతా-శిశు ఆరోగ్య సేవలు, టీబీ ముక్త్ భారత్ కార్యక్రమం, సార్వత్రిక టీకాల కార్యక్రమం, అసంక్రమిత వ్యాధుల (ఎన్‌సీడీ) నియంత్రణ, సీజనల్ వ్యాధుల నివారణ తదితర అంశాలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ఆరోగ్య కేంద్రాల వారీగా మాతా-శిశు సంరక్షణ, టీబీ నియంత్రణ, ఎన్‌సీడీ కార్యక్రమాల పురోగతిని పరిశీలించిన కలెక్టర్, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరగడానికి వైద్యాధికారులు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు. గర్భిణులకు ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తల ద్వారా అవగాహన కల్పించి ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. టీబీ ముక్త్ భారత్ కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేయాలని, గ్రామీణ ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి నిర్ధారణ పరీక్షలను వేగవంతం చేయాలని సూచించారు. అసంక్రమిత వ్యాధులతో బాధపడుతున్న రోగులకు జీవనశైలి మార్పులు, ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని చెప్పారు. గురుకుల విద్యాలయాల్లో ఆర్‌బీఎస్‌కే బృందాల ద్వారా క్రమం తప్పకుండా వైద్య శిబిరాలు నిర్వహించాలని, అన్ని ఆరోగ్య కార్యక్రమాలకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, వైద్యాధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ మరింత బలోపేతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య, ట్రైనీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రోహిత్ నేత, అదనపు డీఎంహెచ్‌ఓ డాక్టర్ మదన్మోహన్ రావు, జిల్లా టీబీ నియంత్రణ అధికారి డాక్టర్ ప్రదీప్ రెడ్డి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ శ్రీకృష్ణారావు, ఎన్‌సీడీ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ మురళి, డాక్టర్ జ్ఞానేశ్వర్, డెమో అశోక్ రెడ్డి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, ఆర్‌బీఎస్‌కే అధికారులు పాల్గొన్నారు.



## ఉచిత కోచింగ్ కు హాజరుకండి

- అభ్యర్థులకు జిల్లా పోలీసుల విజ్ఞప్తి

**ప్రమాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

మహబూబాబాద్ జిల్లా నిరుద్యోగ యువతకు పోలీస్ కానిస్టేబుల్, సబ్-ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ) ఉద్యోగాలకు ఉచిత శిక్షణ అందించేందుకు నిర్వహిస్తున్న ప్రవేశ (స్క్రీనింగ్) పరీక్ష ఆగస్టు 2, 2026 (ఆదివారం) ఉదయం 10.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంటల వరకు నిర్వహించబడుతుంది.ఈ ప్రవేశ పరీక్షను మహబూబాబాద్ పట్టణంలోని శ్రీ చైతన్య టెక్నో స్కూల్ మరియు మహర్షి స్కూల్, కేసముద్రం రోడ్ పరీక్షా కేంద్రాలలో నిర్వహించనున్నారు.ఇప్పటికే తమ పేర్లు నమోదు చేసుకున్న అభ్యర్థులు తమకు కేటాయించిన పరీక్షా కేంద్రానికి సకాలంలో చేరుకొని పరీక్షకు హాజరుకావాలని జిల్లా ఎస్పీ డా. శబరీష్ సూచించారు. రవాణా సౌకర్యం అవసరమైన అభ్యర్థులు తమ సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించవచ్చు. అవసరాన్ని బట్టి సంబంధిత పోలీస్ స్టేషన్ల నుండి పరీక్షా కేంద్రాలకు వాహనాల ఏర్పాటు చేయబడుతుంది.పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అందిస్తున్న ఈ ఉచిత కోచింగ్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచి, భవిష్యత్తులో పోలీస్ శాఖలో ఉద్యోగాలు సాధించాలని జిల్లా పోలీసులు ఆకాంక్షిస్తూ, పరీక్షకు హాజరయ్యే ప్రతి అభ్యర్థికి మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా. శబరీష్, హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.




## అబ్జర్వేషన్ హోమ్‌కు 15 మంది మైనర్లు తరలింపు

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

మైనర్లు వాహనాలు నడపకుండా నిరోధించేందుకు వరంగల్ ట్రాఫిక్ పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. బుధవారం వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో వాహనాలు నడుపుతున్న 15 మంది మైనర్ బాలురు, బాలికలను గుర్తించి వారిపై జువెనైల్ చట్టం ప్రకారం కేసులు నమోదు చేసి జువెనైల్ కోర్టులో చార్జ్‌షీట్లు దాఖలు చేశారు. విచారణ అనంతరం గౌరవ జువెనైల్ మేజిస్ట్రేట్ ఆదేశాల మేరకు ఆ 15 మంది మైనర్లను ఒక రోజు పాటు బాలల అబ్జర్వేషన్ హోమ్‌కు పంపించారు. ఇకపై కూడా మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే వారిని కోర్టు ముందు హాజరుపరచడంతో పాటు వారి తల్లిదండ్రులకు తప్పనిసరిగా కౌన్సెలింగ్ నిర్వహిస్తామని ట్రాఫిక్ పోలీసులు హెచ్చరించారు. అదే రోజు లైసెన్సు లేకుండా వాహనం నడిపిన ఒక వాహనదారుడిని వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ శ్రీ అంకేశ్వరపు కమలాకర్ ఎదుట హాజరుపరచగా, ఆయన రూ.300 జరిమానా విధించారు. ఇక డ్రంక్ అండ్ డ్రైవ్ ప్రత్యేక తనిఖీల్లో పట్టుబడిన ఎనిమిది మందిని కోర్టులో హాజరుపరచగా, వారికి మొత్తం రూ.6,100 జరిమానా విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కె. సుజాత తెలిపారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు తమ పిల్లలకు డ్రైవింగ్ లైసెన్సు వచ్చే వరకు ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలు ఇవ్వొద్దని, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ రోడ్డు భద్రతకు సహకరించాలని ఇన్‌స్పెక్టర్ కె. సుజాత విజ్ఞప్తి చేశారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- ములుగు డీఎస్పీ రవీందర్

**ప్రమాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**




ములుగు సబ్ డివిజన్ పరిధిలో గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల దృష్ట్యా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని డి.ఎస్.పి రవీందర్ సూచించారు. భారీ వర్షాల కారణంగా వాగులు, వంకలు, చెరువులు మరియు లోతట్టు ప్రాంతాలు ప్రమాదకరంగా మారే అవకాశం ఉన్నందున, అత్యవసరం అయితే తప్ప బయటకు వెళ్లకుండా ఉండాలి. ఉప్పొంగి ప్రవహిస్తున్న వాగులు, కాలువలు లేదా రహదారులపై నీరు ప్రవహిస్తున్న ప్రాంతాలను ఎట్టి పరిస్థితుల్లోనూ దాటేందుకు ప్రయత్నించరాదు. తల్లిదండ్రులు తమ పిల్లలను వరద నీటి ప్రాంతాలకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. రైతులు, పశువుల కాపరులు వర్షం మరియు పిడుగులు పడుతున్న సమయంలో చెట్ల కింద నిలబడకుండా సురక్షిత ప్రదేశాల్లో ఆశ్రయం పొందాలి. వాహనదారులు భారీ వర్షాలు కురుస్తున్న సమయంలో, ముఖ్యంగా రాత్రి వేళల్లో, అత్యంత అప్రమత్తంగా ప్రయాణించాలి. రహదారుల పరిస్థితిని తెలుసుకున్న తర్వాత మాత్రమే ప్రయాణాలు చేపట్టాలి. ఎక్కడైనా రహదారులు దెబ్బతినడం, చెట్లు కూలిపోవడం, వరద నీరు చేరడం లేదా రహదారులపై నీరు ప్రవహించడం వంటి పరిస్థితులు ఎదురైతే, అక్కడ విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది సూచనలను తప్పనిసరిగా పాటిస్తూ వారికి పూర్తి సహకారం అందించాలి. ములుగు జిల్లా పోలీసు సిబ్బంది 24 గంటలు అప్రమత్తంగా ఉండి, లోతట్టు ప్రాంతాలు, వాగులు, ప్రధాన రహదారులు మరియు వరద ప్రభావిత ప్రాంతాల్లో నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తూ పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. ప్రజలందరూ పోలీసు శాఖ మరియు ఇతర ప్రభుత్వ శాఖలు జారీ చేసే సూచనలు, హెచ్చరికలను పాటిస్తూ తమ భద్రతతో పాటు ఇతరుల భద్రతకు కూడా సహకరించాలని విజ్ఞప్తి చేసారు

## ఆర్ఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలి

- - జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి రవి రాథోడ్

**మహబూబాబాద్, జులై29(ప్రభాత గమనం):**

బుధవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి రవి రాథోడ్ జిల్లాలోని మరిపెడ మండలంలో గల కంపాటి రవి బాబు ఆర్ఎంపి ప్రజత క్లినిక్ ను సీజ్ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి క్లినిక్ వారితో ప్రథమ చికిత్స మాత్రమే చేయవలెనని స్థాయికి మించిన ( ఇంజక్షన్లు, సెలైన్లు) వైద్యం చేసినయెడల చట్టరీత్య చర్య తీసుకుంటామని జిల్లాలోని ప్రథమ చికిత్స చేసే ఆర్ఎంపి వైద్యులకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య బృందం మనోహర్, కృష్ణ పాల్గొన్నారు.



## లాభసాటి పంటల సాగుతోనే భరోసా

- మండల వ్యవసాయ అధికారి రామారావు
- చిన్న బంజరలో ఘనంగా రైతు అవగాహన సదస్సు
- కూరగాయలు, పప్పుధాన్యాల సాగుపై అవగాహన

**గార్ల, జులై 29 ( ప్రభాత గమనం):**




రైతులు సాంప్రదాయ పంటలకే పరిమితం కాకుండా అధిక ఆదాయాన్నిచ్చే లాభసాటి పంటల సాగుపై దృష్టి సారించాలని మండల వ్యవసాయ అధికారి కావటి రామారావు పిలుపునిచ్చారు. చిన్న బంజర గ్రామంలో సర్పంచ్ మోతిలాల్ అధ్యక్షతన బుధవారం నిర్వహించిన రైతు అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ... మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తూ సరైన యాజమాన్య పద్ధతులు చేపడితే పంటల్లో అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు.కూరగాయలు పండించడం వల్ల రైతులకు నిరంతరం చేతికి డబ్బులు అంది, ఆర్థిక భద్రత లభిస్తుంది.పప్పుధాన్యాల సాగుతో రైతుకు నికర ఆదాయం దక్కడమే కాకుండా భూసారం గణనీయంగా పెరుగుతుంది.వరి మగాణాల్లో నీటి లభ్యత తక్కువగా ఉన్నందున, ప్రస్తుత పరిస్థితుల్లో పెసర సాగు చేపట్టడం ఎంతో లాభదాయకమని పేర్కొన్నారు.రసాయన ఎరువులను పరిమితంగా వాడుతూ, సేంద్రియ మరియు జీవన ఎరువులను క్రమపద్ధతిలో వినియోగించాలని అధికారి సూచించారు.పచ్చిరొట్ట సాగు చేసిన రైతులు దాన్ని సకాలంలో భూమిలో కలియదున్ని, సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ వేయాలి. దీనివల్ల పచ్చిరొట్ట త్వరగా కుళ్ళి నేలకు ఎంతో బలాన్ని చేకూరుస్తుంది.ఆఖరి దుక్కిలో జింక్ సల్ఫేట్ వాడటం వల్ల మొక్కలలో జింక్ లోపాన్ని నివారించవచ్చు. అంతేకాకుండా, ఇది ఇతర పోషకాలను మొక్క సమర్థవంతంగా గ్రహించేలా దోహదపడుతుంది.ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారిణి (AEO) పూజిత, గ్రామ ఉప సర్పంచ్, వార్డు సభ్యులు మరియు పెద్ద సంఖ్యలో స్థానిక రైతులు పాల్గొన్నారు.




## ప్రజా చైతన్యమే కళాకారుల కర్తవ్యం

- సమాజ మార్పునకు కళను ఆయుధంగా మలచాలి
- ప్రముఖ గాయకుడు ఏ. జగన్
- ప్రజానాట్యమండలి రాష్ట్రస్థాయి పాటల శిక్షణ తరగతులు

**గార్ల, జూలై 29 ( ప్రభాత గమనం ):**

కళ ప్రజల జీవితాల నుంచి ఉద్భవించి, తిరిగి ఆ ప్రజల శ్రేయస్సుకే ఉపయోగపడాలని, సమాజంలో చైతన్యాన్ని రగిలించడమే ప్రజా కళాకారుల ప్రధాన కర్తవ్యమని ఉమ్మడి రాష్ట్ర ప్రముఖ గాయకుడు ఏ. జగన్ పిలుపునిచ్చారు.మండల కేంద్రంలో ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి పాటల శిక్షణ తరగతులు రెండో రోజు కూడా ఎంతో ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగాయి. ఈ శిక్షణ శిబిరానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏ. జగన్ కళాకారులను ఉద్దేశించి ప్రసంగించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రస్తుత సమాజంలో సామాన్యులు ఎదుర్కొంటున్న ఆర్థిక, సామాజిక, విద్య, వైద్య, ఉపాధి సమస్యలను కళాకారులు లోతుగా అధ్యయనం చేయాలన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న పాలకుల వైఫల్యాలను తమ ఆట, పాటలు మరియు రూపకాల ద్వారా ధైర్యంగా ఎండగట్టాలని సూచించారు. అన్యాయాలను ప్రశ్నించే శక్తిగా కళ రూపాంతరం చెందాలని, ప్రజల గొంతుకగా కళాకారులు నిలవాలని ఆయన స్పష్టం చేశారు.గ్రామీణ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు అభ్యుదయ భావాలను వ్యాప్తి చేస్తూ, ప్రజా సంస్కృతిని పరిరక్షించేందుకు యువ కళాకారులు ముందుకు రావాలని ఆకాంక్షించారు. ప్రజాస్వామ్య విలువలు, హక్కుల పరిరక్షణ కోసం సాగుతున్న ఉద్యమాలకు కళారూపాలను ఆయుధాలుగా మలచుకోవాలని సూచించారు. ఈ తరగతులు కళాకారులలో సామాజిక బాధ్యతను పెంపొందించే వేదికగా నిలుస్తాయని ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు ఎం.జె. వినోద్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి కట్ట నరసింహ, జిల్లా కార్యదర్శి నక్క సైదులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు వేముల ఆనంద్, కాకం ఆంజనేయులు, రాష్ట్ర సహాయ కార్యదర్శులు కొండూరు భాస్కర్, కుమ్మరి శంకర్, నాయకులు మేడి అంజమ్మ, హరితలతో పాటు పలువురు ముఖ్య నాయకులు, కళాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## హమాలీ కార్మికులకు సమగ్ర సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

- తెలంగాణ హమాలీ అండ్ మిల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కే. సారంగపాణి

**కేసముద్రం, జూలై 29(ప్రభాత గమనం):**

హమాలీ కార్మికులకు సమగ్ర సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలనీ తెలంగాణ హమాలీ అండ్ మిల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కే. సారంగపాణి అన్నారు. కేసముద్రం పట్టణంలో తెలంగాణ హమాలీ అండ్ మిల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ సమావేశం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం. శివకుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు కే. సారంగపాణి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ. .రాష్ట్రవ్యాప్తంగా హమాలీ కార్మికులు రోజు రోజుకు ఉపాధి కోల్పోతూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారని తెలిపారు. హమాలీ కార్మికుల జీవనాధారం పూర్తిగా రైతులు పండించే వ్యవసాయ ఉత్పత్తులపైనే ఆధారపడి ఉంటుందని అన్నారు. వ్యవసాయ రంగంలో యాంత్రీకరణ పెరగడం వల్ల గతంలో మూడు నుంచి నాలుగు నెలల పాటు కొనసాగే సీజనల్ ఉపాధి ప్రస్తుతం నెల రోజులకే పరిమితమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు, గోదాములు, మార్కెట్ యార్డుల్లో స్థానిక హమాలీ కార్మికులకు పని కల్పించాల్సిన చోట గోదాం లేబర్ కాంట్రాక్టర్లు ఇతర రాష్ట్రాల వలస కార్మికులను అధిక సంఖ్యలో నియమిస్తూ స్థానిక కార్మికులను ఉపాధికి దూరం చేస్తున్నారని విమర్శించారు. ప్రతి హమాలీ కార్మికుడికి ప్రభుత్వ గుర్తింపు కార్డు జారీ చేసి, ఆ కార్డు ద్వారా అన్ని సంక్షేమ పథకాలు అమలు చేయాలని అన్నారు.అదేవిధంగా 50 సంవత్సరాలు పైబడిన హమాలీ కార్మికులకు నెలకు రూ.10,000 పెన్షన్ ఇవ్వాలని, ప్రతి హమాలీ కార్మికుడికి ప్రత్యేక గ్రూప్ ఇన్సూరెన్స్ , ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, పరిశ్రమలు మరియు ప్రభుత్వ గోదాముల్లో పనిచేసే కార్మికులందరికీ పీఎఫ్, ఈఎస్ఐ తప్పనిసరిగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో తెలంగాణ హమాలీ అండ్ మిల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారపు శ్రీధర్, బి. వెంకటనారాయణ, కే. సైదులు, బి. మోహన్, పర్వత కోటేష్, యాసారపు వెంకన్న, పందిళ్లపల్లి వీరన్న , భూక్య రాము పాల్గొన్నారు.



# 72 గంటల్లో హత్య కేసు ఛేదన

- నలుగురు నిందితులు అరెస్టు చేసిన మిల్స్ కాలనీ పోలీసులు
- కత్తి, రెండు బైక్‌లు, మొబైల్ ఫోన్లు స్వాధీనం

ప్రమాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఎ.జె. మిల్స్ కాలనీ పోలీసులు కేవలం 72 గంటల్లోనే దారుణ హత్య కేసును ఛేదించి నలుగురు నిందితులను అరెస్ట్ చేశారు. నిందితుల వద్ద నుంచి హత్యకు ఉపయోగించిన ఫోల్డింగ్ కత్తి, నేరానికి వినియోగించిన రెండు ద్విచక్ర వాహనాలు, రక్తపు మరకలతో ఉన్న దుస్తులు, నాలుగు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

ఎ.జె. మిల్స్ కాలనీ ఇన్‌స్పెక్టర్ కర్రె స్వామి తెలిపిన వివరాల ప్రకారం.. జూలై 25వ తేదీ సాయంత్రం 5.12 గంటల సమయంలో ఖిలా వరంగల్‌లోని బి.ఆర్.నగర్‌కు చెందిన మాధ అనిల్ (23)పై ఉర్సుగుట్టలోని అకుతోట ఫంక్షన్ హాల్ ఎదురుగా ఉన్న సీపీఎం కార్యాలయం సమీపంలో ప్రధాన నిందితుడు గిరబోయిన మహేందర్ అలియాస్ మహి తన సహచరులతో కలిసి పదునైన ఫోల్డింగ్ కత్తితో దాడి చేశాడు. అనంతరం గొంతు కోసి, ఛాతిపై తీవ్రంగా పొడవడంతో అనిల్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి సోదరుడు మాధ సాంబరాజు ఫిర్యాదు మేరకు ఎ.జె. మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నెం. 505/2026 కింద భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్) సెక్షన్ 103(1)తో పాటు 3(5) ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో 2023 వినాయక చవితి సందర్భంగా డీజే ఏర్పాటు విషయంలో అనిల్, మహేందర్ మధ్య జరిగిన వివాదమే ఈ హత్యకు దారితీసినట్లు తేలింది. అనంతరం 2023 డిసెంబర్ 31న జరిగిన ఘర్షణలో మహేందర్‌పై అనిల్, అతని సహచరులు దాడి చేయడంతో అప్పట్లో కేసు నమోదైంది. అప్పటి నుంచి కక్ష పెంచుకున్న మహేందర్, బీరన్న బోనాల సందర్భంగా అనిల్ స్వగ్రామానికి వచ్చిన విషయం తెలుసుకుని తన సహచరులతో కలిసి హత్యకు పథకం రచించినట్లు పోలీసులు వెల్లడించారు. జూలై 28న ఆర్టీఏ జంక్షన్ వద్ద పోలీసులు సాధారణ వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా సంచరిస్తున్న నలుగురు వ్యక్తులు కనిపించారు. పోలీసులు ఆపేందుకు ప్రయత్నించగా వారు పారిపోవడానికి యత్నించారు. వెంటనే వెంబడించి మధ్యాహ్నం 1 గంట ప్రాంతంలో అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అరెస్టయిన నిందితుల్లో



గిరబోయిన మహేందర్ అలియాస్ మహి (28) టిప్పర్ డ్రైవర్, కంప రాజేష్ (35) స్క్రాప్ వ్యాపారి, భూక్య పూర్ణచందర్ అలియాస్ పున్ను (24) డెకరేషన్ వర్కర్, కొండపాక కమలేష్ (19) విద్యార్థి ఉన్నారు. ఈ సందర్భంగా ఎ.జె. మిల్స్ కాలనీ ఇన్‌స్పెక్టర్ కర్రె స్వామి మాట్లాడుతూ, వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో హింస, రౌడీయిజం, గ్యాంగ్ వైరం వంటి సంఘవ్యతిరేక కార్యకలాపాలపై జీరో టాలరెన్స్ విధానాన్ని కఠినంగా అమలు చేస్తున్నామని తెలిపారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే వారిపై భారతీయ న్యాయ సంహితతో పాటు ఇతర సంబంధిత చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని, అలవాటు నేరస్థులపై రౌడీ షీట్లు, సస్పెక్ట్ షీట్లు నవీకరించడంతో పాటు అవసరమైతే పీడీ చట్టం కింద కూడా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# అడప మహేష్ హత్య కేసు

- పరారీలో ఉన్న నిందితుడు అరెస్ట్

ప్రమాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :

గీసుగొండ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన అడప మహేష్ హత్య కేసులో పరారీలో ఉన్న నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం, ఏనుమాములకు చెందిన పిట్టల సురేష్ (29) ఇందిరమ్మ కాలనీ సమీపంలోని మామిడి తోట వద్ద ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం అందడంతో పోలీసులు అక్కడికి చేరుకుని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం నిందితుడిని విచారించిన పోలీసులు కేసుకు సంబంధించిన వివరాలు సేకరించారు. అతడి వద్ద ఉన్న ఒక మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని, సంబంధిత పంచనామా నిర్వహించినట్లు తెలిపారు. చట్టపరమైన ప్రక్రియ అనంతరం నిందితుడిని న్యాయస్థానంలో హాజరుపరచగా, కోర్టు అతడికి 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించినట్లు గీసుగొండ పోలీస్ ఇన్‌స్పెక్టర్ డి. విశ్వేశ్వర్ తెలిపారు.





# మహాదేవ్‌పూర్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఎస్పీ

- పెండింగ్ కేసుల పురోగతిపై సమీక్ష
- ఆన్‌లైన్ నమోదుపై ప్రత్యేక దృష్టి : ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్
- ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని ఆదేశాలు

ప్రమాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :

భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, వార్షిక తనిఖీల్లో భాగంగా మహాదేవ్‌పూర్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి సమగ్ర తనిఖీ నిర్వహించారు. జిల్లాలో పోలీస్ వ్యవస్థ పనితీరు, ప్రజలకు అందుతున్న సేవలు, కేసుల దర్యాప్తు పురోగతి, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ సందర్భంగా ఎస్పీ పోలీస్ స్టేషన్ ఆవరణలో వన మహోత్సవంలో భాగంగా మొక్కలను నాటడం జరిగింది, అనంతరం పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. రోడ్డు ప్రమాద కేసులకు సంబంధించిన వాహనాల స్థితిగతులు, వాటి పరిష్కార పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.రిసెప్షన్ విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో మాట్లాడుతూ, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారునితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, అందిన ప్రతి ఫిర్యాదును వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేసి తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసుల పురోగతిని సమీక్షించిన ఎస్పీ దర్యాప్తు వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తూ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అదేవిధంగా స్టేషన్ రికార్డుల నిర్వహణ, సిబ్బంది విధి నిర్వహణ, కేసు రికార్డుల నవీకరణ విధానాన్ని పరిశీలించి, అన్ని రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తూ నిర్వహించాలని ఆదేశించారు. రౌడీ షీటర్లపై తీసుకుంటున్న చర్యలను సమీక్షించి, వారిపై నిరంతర నిఘా కొనసాగించాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి పౌరుడికి స్నేహపూర్వక వాతావరణం కల్పిస్తూ, వారి సమస్యలను వేగవంతంగా, పారదర్శకంగా పరిష్కరించే విధంగా సేవలు అందించాలని అధికారులు, సిబ్బందికి ఎస్పీ ఆదేశించారు. ప్రజల్లో పోలీస్ శాఖపై విశ్వాసం మరింత పెంపొందించడమే తమ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ వార్షిక తనిఖీలలో కాటారం డీఎస్పీ సూర్యనారాయణ, మహాదేవ్‌పూర్ సీఐ వెంకటేశ్వర్లు తదితర అధికారులు పాల్గొన్నారు.

# గార్లలో 'సర్' ప్రక్రియ పరిశీలన

- ప్రతి అర్హుడికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యం
- అర్హులైన ఓటు గల్లంతు కాకుండా చూడాలి : ఎమ్మెల్యే కోరం కనకయ్య
- రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే ధ్యేయం : నియోజకవర్గ ఇన్చార్జ్ రాయల నాగేశ్వరరావు

గార్ల, జూలై 29 ( ప్రభాత గమనం ):



తెలంగాణ రాష్ట్రంలో ప్రతిష్ఠాత్మకంగా జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) ప్రక్రియను కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అత్యంత సమర్థవంతంగా నిర్వహించాలని ఇల్లందు శాసనసభ్యులు శ్రీ కోరం కనకయ్య మరియు నియోజకవర్గ ఎస్ఐఆర్ ఇన్చార్జి శ్రీ రాయల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు.రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి, టిపిసిసి అధ్యక్షులు శ్రీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, మరియు రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్చార్జి శ్రీమతి మీనాక్షి నటరాజన్ ల ఆదేశాల మేరకు గార్ల మండలంలో జరుగుతున్న ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియను బుధవారం ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా గార్ల మండల పిఎసిఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్, మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు తాళ్లపల్లి కృష్ణ గౌడ్ ల అధ్యక్షతన బూత్ స్థాయి ఏజెంట్లు , సీనియర్ నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ... బూత్ ఏజెంట్లు ప్రతి ఇంటికీ వెళ్లి పరిశీలించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు లభించేలా చూడాలని సూచించారు. ఏ ఒక్క అర్హుడి ఓటూ సాంకేతిక లేదా ఇతర కారణాల వల్ల గల్లంతు కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. భవిష్యత్తులో రాహుల్ గాంధీని దేశ ప్రధానిని చేయడమే ప్రతి కాంగ్రెస్ కార్యకర్త లక్ష్యంగా ముందుకు సాగాలని నియోజకవర్గ ఇన్చార్జి రాయల నాగేశ్వరరావు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ శ్రీమతి శంషాద్ బేగం, మాజీ ఏఎంసీ చైర్మన్ భుక్యా నాగేశ్వరరావు, గార్ల మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు గాంగవత్ రామ్ సింగ్ నాయక్, మేజర్ పంచాయతీ సర్పంచ్ బానోత్ పార్వతి హతిరామ్ నాయక్, చిన్న బంజర సర్పంచ్ బానోతు మోతిలాల్ నాయక్, మర్రిగూడెం సర్పంచ్ భూక్యా రామ్ సింగ్ నాయక్, ముల్కనూరు సర్పంచ్ వెంకట్రావు, సీతంపేట సర్పంచ్ గుగులోత్ వీరియా నాయక్, పిన్ రెడ్డిగూడెం సర్పంచ్ కేలోత్ వీరన్న, సిరిపురం సర్పంచ్ గుగులోతు భారతి, చిన్న బంజర నాయకులు భద్రు నాయక్లతో పాటు వివిధ గ్రామాల ఉపసర్పంచులు, బూత్ కమిటీ ఏజెంట్లు, వార్డు సభ్యులు, సీనియర్ నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధుల నివారణకు మందులు సిద్ధంగా ఉంచాలి

- డీఎంహెచ్‌వో డాక్టర్ ఏ. అప్పయ్య

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :

సీజనల్ వ్యాధుల నివారణకు అవసరమైన ప్రాథమిక మందులు, రాపిడ్ టెస్ట్ కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండేలా ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు చర్యలు తీసుకోవాలని హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ ఏ. అప్పయ్య సూచించారు. బుధవారం ఆత్మకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పెంచికల్‌పేట, నీరుకుల, గూడెపాడు ఆరోగ్య ఉపకేంద్రాల్లో నిర్వహించిన టీకా సెషన్లను డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపకేంద్రాల్లో అందుబాటులో ఉన్న మందులు, దయాగ్నొస్టిక్ కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, వ్యాక్సిన్ల నిల్వలను పరిశీలించి సంబంధిత సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జలుబు, జ్వరం, విరేచనాలు వంటి సీజనల్ వ్యాధులకు సంబంధించిన మందులతో పాటు రాపిడ్ టెస్ట్ కిట్లు ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తల వద్ద ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలని అన్నారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధుల నివారణకు చేతుల పరిశుభ్రత, పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూడడం, ప్రతి వారం డ్రై డే పాటించడం వంటి అంశాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. పంచాయతీ సిబ్బందితో సమన్వయంగా పనిచేసి పారిశుద్ధ్య చర్యలను మరింత పటిష్ఠం చేయాలని ఆదేశించారు. టీకాల కోసం వచ్చే తల్లులు, గర్భిణీ స్త్రీలకు మాతా-శిశు ఆరోగ్యం, పోషకాహారం, ప్రభుత్వ ఆరోగ్య సేవలు, సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించి వాటిని సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నీరుకుల, పెంచికల్‌పేట, గూడెపాడు గ్రామాల్లో నిర్వహించిన టీకా కార్యక్రమాల్లో డ్యూ లిస్ట్ ప్రకారం మొత్తం 12 మంది చిన్నారులకు అవసరమైన వివిధ టీకాలను విజయవంతంగా అందించినట్లు సంబంధిత ఏఎన్ఎంలు డీఎంహెచ్‌వోకు వివరించారు. టీకా కార్యక్రమాల నిర్వహణ తీరుపై ఆయన సంతృప్తి వ్యక్తం చేస్తూ, ప్రజారోగ్య పరిరక్షణలో సిబ్బంది మరింత అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు.



# కేజ్ వీల్స్ తో ట్రాక్టర్లు నడిపితే జరిమానా

- వెంకటాపూర్ ఎస్సై చల్ల రాజు

ప్రమాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :



వెంకటాపూర్ మండలంలో రోడ్లపై ట్రాక్టర్లు కేజ్‌వీల్స్‌తో తిరిగితే జరిమానా తప్పదని వెంకటాపూర్ ఎస్సై చల్ల రాజు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రోడ్లపై ట్రాక్టర్ కేజీ వీల్స్ తో వెళ్లాలంటే కేజి వీల్స్ కు వెడల్పు పట్టీలు పెట్టుకొని పోవాలని తెలిపారు. ట్రాక్టర్ కేజ్ వీల్స్‌తో రోడ్డుపై తిరిగితే మొదటిసారి రూ.5 వేలు, రెండోసారి రూ.10 వేలు జరిమానాతోపాటు ట్రాక్ట ర్ సీజ్ చేయడం జరుగుతుందని తెలియజేశారు .ట్రాక్టర్ల యజమానులు ప్రభుత్వం కోట్లు ఖర్చు పెట్టి రోడ్లు వేయిస్తే ట్రాక్టర్లు నడిపే వారు కేజ్‌వీల్స్‌ను ఉపయోగించి ధ్వంసం చేయడం సరి కాదన్నారు. నిబంధనలు ఉల్లంఘించి కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై రాజు హెచ్చరించారు



# హోంగార్డ్ కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సాయం

- చెక్కును అందజేసిన వరంగల్ సీపీ ఎన్. శ్వేత

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :

ఆకస్మికంగా మరణించిన హోంగార్డ్ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.5 లక్షల ఆర్థిక సాయం చెక్కును వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ బుధవారం కమిషనరేట్ కార్యాలయంలో అందజేశారు. రాష్ట్ర పోలీస్ శాఖకు సహాయ సహకారాలు అందిస్తూ విధులు నిర్వహిస్తున్న హోంగార్డులు ఆకస్మికంగా లేదా ప్రమాదాల్లో మరణించిన సందర్భాల్లో వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించే పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకం కింద దుగ్గొండి పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తూ గత ఏడాది ఆకస్మికంగా మరణించిన పి. శ్రీనివాస్ రెడ్డి భార్యకు సీపీ ఎన్. శ్వేత ఆర్థిక సాయం చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, హోంగార్డులు పోలీస్ శాఖకు అందిస్తున్న సేవలు ఎంతో విలువైనవని పేర్కొన్నారు. వారి కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని ఆమె భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు డీసీపీ శ్రీనివాస్, హోంగార్డ్స్ ఆర్ఐ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్టీ కమిషన్‌కు అధికారుల అబద్ధాల నివేదిక!

- గిరిజనులను మోసం చేస్తున్న అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలి!
- మహబూబాబాద్ జిల్లా గార్ల మండలంలో కలెక్టర్ సర్వే వివాదం
- పీసా చట్టానికి చిల్లు.. దొంగ తీర్మానాలతో జాతీయ కమిషన్‌కు బురిడీ
- జీవో 98ని వెంటనే రద్దు చేయకపోతే ప్రజాపోరాటం తప్పదు
- మీడియా సమావేశంలో 'తెలంగాణ విద్యావంతుల వేదిక' రాష్ట్ర ఉపాధ్యక్షులు విశ్వ జంపాల తీవ్ర ఆగ్రహం

గార్ల , జులై 29 (ప్రభాత గమనం):



రాజ్యాంగబద్ధంగా గిరిజనులకు సంక్రమించిన హక్కులను కాలరాస్తూ, జాతీయ ఎస్టీ కమిషన్‌కు పచ్చి అబద్ధాలతో నివేదిక సమర్పించిన అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు, న్యాయవాది విశ్వ జంపాల ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం గార్ల మండల కేంద్రంలోని తన కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులతో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా విశ్వ జంపాల మాట్లాడుతూ.. మహబూబాబాద్ జిల్లా, గార్ల మండలంలోని 5వ షెడ్యూల్డ్ గిరిజన ప్రాంతంలో "మున్నేరు - పాలేరు లింక్ కెనాల్" (జీవో 98) ప్రాజెక్టు పేరుతో గిరిజన రైతుల నోటికాడు లాక్కునేందుకు అధికారులు కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు.జాతీయ షెడ్యూల్ తెగల కమిషన్ ఆదేశాల మేరకు మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ సమర్పించిన నివేదిక పూర్తిగా అసంబద్ధం, రాజ్యాంగ విరుద్ధమని స్పష్టం చేశారు.ముల్కనూర్, చంద్రగిరి, బుద్దారం, గార్ల గ్రామాల్లో పీసా గ్రామసభలు నిర్వహించి, అందరి ఆమోదంతోనే భూసేకరణ చేస్తున్నామని కలెక్టర్ కమిషన్‌కు నివేదించారు.పీసా చట్టం-1996 ప్రకారం ప్రతీ గిరిజన ఆవాసంలో 30 రోజుల ముందే సమాచారం ఇచ్చి, 1/3 వంతు మహిళలతో సహా కనీసం 1/3 వంతు ఓటర్ల సమక్షంలో సభ జరిపి 2/3 వంతు మెజారిటీతో ఆమోదించాలి. వీటన్నింటినీ వీడియో రికార్డింగ్ చేయాలి. కానీ అధికారులేమో పంచాయతీ కార్యాలయాల్లో కూర్చొని సర్పంచ్, కార్యదర్శులతో రాసుకున్న సాధారణ తీర్మానాలను 'పీసా ఆమోదాలు'గా చిత్రీకరించి జాతీయ కమిషన్‌ను, గిరిజనులను నిలువునా ముంచారని మండిపడ్డారు.రైతులు స్వచ్ఛందంగా భూములిస్తున్నారని ఉన్నతాధికారులు సమర్పించిన నివేదికపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో రైతుల నిరసనలను తొక్కిపెట్టడానికి భారీగా పోలీసు బలగాలను మోహరించి, భయాందోళన వాతావరణంలో బలవంతపు సర్వేలు నిర్వహించారని విమర్శించారు.మండలంలో 70 శాతానికి పైగా ఉన్న చిన్న, సన్నకారు గిరిజన రైతుల ఏకైక జీవనాధారమైన 300 ఎకరాల సారవంతమైన భూములను లాక్కోవడం 1/70 చట్టానికే కాకుండా గిరిజనుల మనుగడకే ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేశారు. నీటి వనరులు పుష్కలంగా ఉన్న ప్రాంతాల కోసం గిరిజనుల భూములను బలికోరడం దుర్మార్గమని పేర్కొన్నారు.తప్పుడు నివేదిక ఇచ్చిన అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలి. జీవో 98 మరియు మున్నేరు-పాలేరు లింక్ కెనాల్ ప్రాజెక్టును తక్షణమే రద్దు చేయాలి. పోలీసు మోహరింపును విరమించి, బలవంతపు భూసర్వేలు నిలిపివేయాలి.పీసా చట్టం-1996 ప్రకారం ప్రతి గిరిజన ఆవాసంలో స్వేచ్ఛాయుత వాతావరణంలో చట్టబద్ధమైన గ్రామసభలు జరపాలి.కలెక్టర్ సమర్పించిన బోగస్ నివేదికను తిరస్కరిస్తూ రాబోయే 15 రోజుల్లో జాతీయ ఎస్టీ కమిషన్ ముందు బలమైన 'రీజాయిండర్' దాఖలు చేస్తున్నామని విశ్వ జంపాల వెల్లడించారు. ప్రభుత్వం తన వైఖరి మార్చుకోకపోతే న్యాయస్థానాల్లో న్యాయపోరాటంతో పాటు, క్షేత్రస్థాయిలో బహుజన, ప్రజా సంఘాలను కలుపుకొని పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ విలేకరుల సమావేశంలో సామాజిక కార్యకర్త, సీనియర్ జర్నలిస్ట్ కందునూరి ఈశ్వర్ లింగం, బిఆర్ఎస్ నాయకులు మాజీ ఎంపీటీసీ శీలంశెట్టి రమేష్, సిపిఎం నాయకులు ఇమ్మడి గోవింద్, సిపిఐ నాయకులు భూక్యా హరినాయక్, ముంగి రాములు, తాళ్లూరి మహేష్ పాల్గొన్నారు.

Printed, Published and Owned by PANDULA RAVICHANDER at .H NO 1-67/16/B/R NTR NAGAR COLONY KESAMUDRAM VILLEGE, MAHABUBABD, TELANGANA, 506101, Editor. P. Ravichander. email:www.prabhatagamanam.com * RNI NO.TELTEL/2022/83842* CELL : 7780470374